# 'సోల్' మెండర్

ఎస్. ఎస్ ప్రకాశరావు

**బా**బూ! బాబూ! ఆపండి.

ఏటి మీరు సేస్తున్న పని? మీరు మనుసులా? రాచ్చసులా? మీ రేటి, మీరు సదుంకున్న బాబులు! మీకు నే నేటి, సదువులేని మూర్ఖుణ్ణి, సెప్పడం? ఆల్లమ్మనీ, బాబునీ వొగ్గేసి, ఇంత దూరం సదుంకుందికి సిన్న సిన్న బాబులు కొత్తగ వొస్తే, ఆల్లకి మీరు సేసే మరియాదా ఇదా? ఇదేనేటి, బాబూ, నాకు తెలకడుగుతాను, ఇదే నేటి మీ ఇంజినీరు సదువులో సెప్పేది? ఎందుకు, బాబూ, ఈ సదువులు? తోటిమనిసితో మసలడం తెలకపోనాక!

బిగుతు పంట్లాం వేసుకుని, దొరబాబుల్లాగ మీరు ఈడుల్లో కెల్తారే! ఏటి, మీరేనా సేసే దీ పని? ఆ కొత్త బాబుకి పంట్లాం సొక్కా ఇప్పించేసి, గోసీగుడ్డతో ఈ ఆస్టలు ఒల్లింగు సుట్టూరా లగెత్తిస్తారా? అజ్జాసి మీకు నవ్వొస్తా ఉందా? సిగ్గు—సిగ్గు, బాబూ!... 'ని వ్వెవడివిరా, నాను సెయ్యనంటే, ఆ బాబుని ఇంకా అల్లరి పెట్టించేసుతారా? మీ సూదిబూట్లన్నీ నా కాడికే పాలీసు పెట్టించిందికి ఇస్తారే! మీరు, మీ రేటి... ఇయ్యాల ఆ పాలీసు డబ్బాల రంగంతా ఆ సిన్నబాబు తెల్లముఖంమీద పులిమేస్తున్నరు! ఆ బాబు ముఖంలో జాలి మీ కల్లకగబడ్డం నేదా? మీ తమ్ముల్లు, మీ పిల్లలు—ఆల్లకీ ఇలాగే సేస్తారా? సెప్పండి, బాబూ!. . .

ఎప్పుడూ ఇల్లొగ్గిరాని బాబులు, ఉప్పుడు పెద్ద ఇంజనీరు సదుంకుందారని ఇంత దూరాబార వొస్తే, ఆల్లమ్మా ఆయ్యా దెవకవొచ్చి, దిగులు బిగులుగా ఉంటా ఉంటే— ఆల్లకి దయిర్యం సెప్పి, ఆల్లని సంతోసంగా ఉండీనాగ సెయ్యకన్నా, ఏటిది? ఏ టీ గోరం? ఆ బాబుకి బయుం పుట్టించి, 'ఇంకేటీ సదువు' అనిపిచ్చేసి, ఆల్లూరు పోయీనాగ సేస్తారా?. . .

ఇది నిజివేనేటి, బాబూ! సిన్న ఓ కొత్త బాబు బాతురూంవు నోకి తానానికెల్తే, ఆ బాబు చబ్బు వొల్లంతా పట్టించుకున్న ఎంటనే, పైని సీల్ల పంపు గొట్టాం కట్టేస్తారా? ఆ బాబు లోపల్నించి సలితో, 'నీల్లు వొగ్గండి, నీల్లు వొగ్గండి సలి! సలి!' అని అరుస్తా ఉంటే, మీరు పైనించి నవ్వుకుంటున్నారా? నవ్వెట్టా గొచ్చింది, బాబూ! ఒక లేడుస్తా ఉంటే ఎవుడికైనా నవ్వొచ్చినాదంటే ఆడు మనిసి

కదప్ప మాట! దానికి తిరుగు నేదు. రోసి రోకడు తాసం జేస్తా ఉంటే సంపుగొట్టాలు కట్టేడవేనేటి, బాబూ, మీరు ఇంజినీరు సదువుల నేర్చుకున్నారు?



**ఈ కాలంలో ఏమిటి, ఆ కాలంలో ఏమిటి – ఏ కాలంలో అయినా చదువు ముఖ్యం. చదువులేనివాడు ఎందుకూ కొరగాడు. ఎంత చదువుకొంటే అంత మంచిది. బిడ్డల క్షేమం కోరి ఎంతదూరమైనా పంపుతారు తల్లిదండ్రులు. ఆ వయసులో 'లోకం అంటే ఏమిటో తెలియదు పిల్లలకు. తల్లితండ్రుల ప్రేమాభిమానాలు లోకంలో అంతటా వెల్లివిరుస్తాయని నమ్మే అమాయకత్వం ఉంటుంది. వారికి ఎదురయ్యే పరిస్థితులు మరొకరకంగా, క్రూరంగా, ఉంటాయి మరి.**

ఇంకో బాబుకీ ఇలాగే మరొటి సేసేరు మీరు! నా కన్నీ ఎరికే, బాబూ! ఆ బాబుని గదిలో గోడకురిసీ ఏయించి, నాలుగు గంటలసేపు అలాగే ఉంచీసేరా? మనిసనీ వోడు—అందల అసలు సదుంకున్నోడు సెయ్యవల్సిన పనేనా, బాబూ, ఇది? ఏటి, ఏం పాపం సేసేడని ఆ బాబుకి ఆ సిచ్చ? సెప్పండి బాబూ, ఇంటాను. కొత్తగా ఇంజినీరు సదుంకుందికి వొచ్చేడనా! ఏటి,బాబూ! మీరూ కిందటేడో, అంతికి ముందో అలాగే, ఆ బాబులాగే వొచ్చి వోళ్ళే కదా? అప్పుడు మీకు అలాగే సేసుంటారు. అందికి మీకు కచ్చ. అది తీర్చుకుందికి ఉప్పుడు ఈ బాబులు తేరగా దొరికేరు. అంతే, బాబూ, అంతే!. . .

బాబూ! నాకు తెలకడుగుతాను— తప్పుడు మాట మాటంటే— ...సెప్పు తీసి నా సెంపలు వోగించండి. నాకు తెలకడుగుతాను—మన అమ్మా, అయ్యా ఆల్ల సిన్నతనంల ఇట్టాంటి పెద్ద పెద్ద ఇంజినీరు సదువులు సదుకుందికి అవుకాసాలు నేక ఏదో సిన్న సిన్న నవుకరీలు సేసుకుంటన్నారు. కానీ, బాబూ! ఆల్లు ఇయాల మిమ్మన్ని ఇంత ...బ్బి కరుసు పెట్టి ఇక్కడ ఎందుకు సదివిస్తన్నరు? వొప్పుడైన ఆలోసించేవా బాబూ! 'అరె! నాను ఇంజినీరు నేకపోతే డాక్టరు కానేకపొనానే—పోనీ, నా కొడుకు ఈణ్ణయినా సదియిద్దాం' అని అనుకోబట్టే కదు బాబూ! అంతేగాని, ఉప్పుడు మీ నాగ— మనం అప్పుడు కట్టాలు, బాదలు పడ్డాం. అందుసేత ఈల్లూ అలాగే పడాలని మన అమ్మా, అయ్యా అనుకుంటే, బాబూ! మీరు ఇందాక వొచ్చివోరే కాదు. నామ గేరంటి సెప్పగల్ను. . .

మ రిగనేటి? శ్రీకృష్ణులవోరి లీలల్నాగ ఎన్నని సెప్పడం? అయ్యింటే పున్యం, పురుసార్దం వొస్తది. ఇంక సెప్పుకుంటె, తల్సుకుంటె ఏటి, బాబూ, మిగిలీది ఇంత బాద తప్ప? మరో కొత్త బాబు—ఇంకా వొచ్చి అరి గదిలో సామాన్లు ఎట్టుకున్నాడో నేదో—అప్పుడే వచ్చీసేరు మీ ముటా. ఏటి సేసేరు? ఆ బాబుని తీసిగెల్లి ఒక గదిలో ఎట్టి పైన తాలం ఏసేసి, మల్లీ రేత్తిరి కొచ్చి తీసేరు. ఆ బాబు దాగం, ఆకలి అది బాద పడతా ఉంటే మీకు ఆనందం, బాబూ! సంతోసం!

సెప్పులు కుట్టుకునీవోడు మాకు నీతులు సెప్పడం ఏటని అనుకుంటన్నారా, బాబూ! నీతికి మనిసి సేసే నౌకరీదేటుంది? మా తాత అనీవోడు— 'దరమవ్యాదుడని మహన్నబావు డుండీవోడూ. ఆయన మాంసం అమ్ముకునీ యాపారం సేసీవోడూ. అయితె మాత్తరం ఏట్రా ఆ బాబుకి తక్కువ? అన్ని సేస్త్రాలూ తెల్సు. అన్ని నీతులూ తెల్సు. దరమంగ బతుకు బతికేడ్రా ఆ బాబు! అందికే ఆయన పేరు ఇయాల మనం సెప్పుకుంటన్నావు' అనీవోడు మా తాత. ఎందుకు సెప్పేనంటే, బాబూ! మీ రంతా సదుంకుంటన్నోల్లు. ఇంత నావు పుస్తకాలు మోనుగువి పరీచ్చల రోజుల్లో రుసుల్నాగ గెడ్డాలూ, మీసాలూ పెంచి కట్టపడి సదుంకుంటారు. కాని, నే నని దేటంటే, బాబూ, మనిసి అనీవోడికి మంచితనం ఉండాల, బాబూ! అది నేకపోతే ఆడు మనిసే కాడు. మీరు కొత్త స్టూడెంటూ బాబుల్ని ఇది గిర్యిదంగ అల్లరి పెడతన్నారని తెల్సి దూరారా బారంలనున్న ఆల్లమ్మా, అయ్యా ఎంత గాబర పడతా ఉంటారో? ఆలోసిచ్చండి, బాబూ! మీకూ తెలుస్తదా బాద!. . .

ఈ కొత్త బాబు లందరికి పదారు సంవత్సరాల వొయిస్సు దాటదు. ఇంకా సర్దాగ ఆడుతూ పాడుతూ ఉంటారు. ఆల్లు బయిల్నాగ ఈ ఆస్టల్లో, రాచ్చసుల్లాటి మీ మద్దిన పడోస్తె ఆల్లకి దిక్కెవురు? పెద్ద క్లాసు సదుంకుంటున్న మరో బాబు కాడికి ఈ సిన్నబాబుని అంపించి ఆర్ని 'వొరే' అని పిలవమని సెప్తారా! సేస్తె వొక గొడవ! సెయ్యకపోతే మరొక అల్లరి! ఏటిది? ఆల్లు నెందు కింత అల్లరిపాలు సెయ్యాల? మీకున్న అదికారవేటి? ఏ టీ ఆదార్టికం?. . .

ఏటి, బాబూ! సీనియారు స్టూడెంటు కుర్రోల్లమీద ఈ సిన్న అబ్బాయిలకి గౌరువం మప్పిందికా? ఎపుడయినా నవ్వుతాడు, బాబూ! తన్నీ, బయపెట్టి తెప్పించుకున్న గౌరువం ఎన్నాల్లుంటాది, బాబూ! అస లదీ ఒక గౌరువవే నేటి? మనలో సరుకుండాల గాని, తెచ్చిపెట్టుకున్న గౌరువం ఇలవ ఏటి? కాకి ఎన్ని నెమిలి ఈకలు ఎట్టుకున్నా, అది కాకే అవుద్ది కాని మరొటి ఎలా అవుద్ది? అయినా కాసి, బాబూ, ఈ సిన్న బాబుల్తో నిమ్మలంగ మాట్టాడితె, ఆల్లకి ఇక్కడంత కొత్త అనిపించకుండ ఉండీనాగ ఆల్లతో కలిసి మెలిసి అన్నయ్యల్నాగ తిరిగితె— మీరు సెప్పాలేటి, బాబూ! ఆల్లే సచ్చినట్టు మీకు గౌరువం ఇస్తారు.

బాబూ! ఈ జబ్బు మీ ఇంజినీరు కుర్రోల్లకే గాదు, డాట్టరు సదుంకునీ వోల్లలోనూ ఉంది. అక్కడ మరీ గోరం. మొన్న అటుకేసి ఎల్లేను ఏటి బేరా ల్నేకపోతె. గోరం అంటె ఇంతా అంతా కాదు! అక్కడ ఆడపిల్లలు కూడా ఉంటారు గదా! ఆల్లు ఎదురుగ్గా ఈ కొత్తగ సేరిన బాబుకి పంట్లం ఇప్పీసి పంపించినారు. ఎందుకు, బాబూ, ఈ పని? ఇది సేసి సంతోసించిందికే? ఇందల సంతోసం పడ్డానికేటుంది, బాబూ!. . .

బాబూ, నా కడుపుల మాట ఒకటి సెపతాను. . . ఏ పాపాల్జేసుక ఈ పుటకలు పుట్టేవో...రోజా కడుపు కింత కూడు నోసుకోనేదు. కంటినిండ కునుక్కి నోసుకోనేదు. సలేస్తె వొంటి నిండ కప్పుకుందికి సింకి గుడ్డముక్కకి నోసుకోనేదు. ఏం బతుకులు, బాబూ, మావి! మా నాంటి సదువులేనోల్లకి ఉన్న ఆసె వొక్కటే, బాబూ! మీరంతా సదూకుంటన్నోల్లు — మంచీ సెడూ, నాయం అన్నాయం తెలుసుకుంటన్నోల్లు. మీరే ఎప్పటికైన కూలోడి కడుపు కింత కూడు దొరికే రాజ్యం సాదించాల, బాబూ! అదే మా ఆసె, బాబూ!. . .

కాని, కోపం దెచ్చుకోనంటె, బాబూ, ఒకటి సెపతాను. కూడుకీ, గుడ్డకీ నోచ్నేదు మీకు. అందికె అలాగ కొట్టుకు సస్తన్నారు. కాని, మాకు అన్నీ నోటే, బాబూ! మా వంగతి ఒక్కసారి ఆలోసిచ్చండి, బాబూ!

కొత్తగ వొచ్చిన బాబులందరు ఈ బాదలు అనుబవించి, బెదిరిపోయి జొరాలు దెచ్చుగున్నా, సదువు లొగ్గీసి ఆల్ల ఇల్లకి తిరిగెల్లి పోయినా, ఆల్లమ్మా, అయ్యా ఎన్నో ఆసెలు ఎట్టుకోని అప్పులూ సప్పులూ సేసి జీతాలు కట్టి సదివిస్తు ఉంటె ఆల్ల ఆసెలన్నీ బుగ్గిపాలయిపోయినా— ఈ పాపం ఎవురిది, బాబూ? నీది, బాబూ! నీది. . . మీది!. . .

"ఏయ్! ఆ బూట్లన్నీ పాలిష్ చేసేసేవా?" అన్న పిలుపు విని మేలుకొన్నాడు అప్పలకొండ.

"ఆఁ, అయిపోనాది, బాబూ! ఇదుగో . . . ఇందల మీ బూ టేది, బాబూ?" అన్నాడు.

ఆ వచ్చిన కుర్రాడి ముఖంలో అవమానం, ఆక్రోశం, చేతగానితనం తొంగిచూస్తున్నాయి. ఏమీ మాట్లాడలేకపోతున్నాడు. అతని కళ్ళ నిండా నీళ్ళతో మెరుస్తున్నాయి. అతని కింది పెదవి విపరీతంగా అదిరి పడుతూంది.

"ఏది, బాబూ, మీ బూటు?" అన్నాడు అప్పలకొండ మళ్ళీ.

ఆ కుర్రాడు కింది పెదవి పంటితో నొక్కుకుంటూ, మెల్లగా అన్నాడు: "నేను నా బూటు ఇవ్వలేదు. . . ఈ సీనియర్ కుర్రాళ్ల బూట్లన్నింటికీ పాలిష్ డబ్బులు నే విస్తాను. . . అవి ఏ రూముల్లో వాళ్ళవో చెప్పు, నేను తీసుకెళ్ళి ఇవ్వాలి. . ." ★

ఉన్మాదం హేతువునే
నాశనం చేస్తుంది కాని,
హాస్యాన్ని కాదు.

—ఎమర్సన్